# సుభద్ర...సుఖం

రచన — జె. శ్రీరామ్

**జరిగిన కథ**

ఎంతో అనుకూలమైన భర్తతో కాపరంచేయడం పిల్లలమధ్య కులాసాగా జీవితం గడపడం-ఇట్లాంటి పరిస్థితుల్లో తన్ను ఊహించుకుంటూవుండేది సుభద్ర కాపరానికి వెళ్లేవరకూ.

కానీ తనంతవరకూ నోచుకోలేదని త్వరలోనే గ్రహించింది.

మొదట్లో బాగానే వున్న భర్త క్రమంగా మారుతూవచ్చాడు. విసుక్కోవడం, అనవసరంగా తిట్టడం-వీట్లతో మొదలెట్టి చివరకు తనతో భోంచేయడంగూడా ఆయనకు కష్టమైపోయింది. తనభోజనం గదిలోకి తీసుకురావలసినదని ఆజ్ఞాపించాడు రామారావు. భార్యతో మాట్లాడంగూడా ఎప్పుడో ? ఎంతో అవసరం వచ్చినప్పుడు మాత్రంముభావంగా మాట్లాడేవాడు.

సుభద్ర కుమిలికుమిలి ఏడ్చింది. తన్ను తనే ఓదార్చుకోడానికి ప్రయత్నించింది, ఆ యింట్లో తనూ, తనతో మాటగూడా సరిగ్గా లేనిభర్తా. పిల్లాజెల్లా ఎవరూ లేరు. వంటచేసి ఆయనగదిలో పెడితే రామారావు తినివెళ్లేవాడు. తను భోంచేస్తే చేసేది లేకపోతే లేదు. పనిలేనప్పుడు ఓపిక వున్నప్పుడూ ఏడుస్తూ అట్లాగే కూర్చునేది.

తనభార్య మతి చెడ్డదా అన్న అనుమానం హటాత్తుగా రామారావుకు కలిగింది. ఒకరోజు సుభద్ర మాటలాడడం, నవ్వడం వినిపించినై. ఎవరితోనా మాట్లాడడం అని చూడ్డానికి వెళ్లాడు చప్పుడు చెయ్యకుండా. తనభార్య తనలో తను మాట్లాడుకుని నవ్వుతోంది పకపకా. మళ్లీ ఏదో మాట్లాడు కుంటోంది. పిచ్చేనని ధృవపరచుకున్నాడు.

రానురాను ధోరణి ఎక్కువైంది. జోలపాటలు పాడడం, పిల్లలను సముదాయిస్తున్నట్లు, భర్తతో పిల్లల్నిగురించి మాట్లాడుతున్నట్లు - ఇట్లా ఏదో మాట్లాడుతూవుండేది సుభద్ర.

రామారావు డాక్టర్ని తీసుకువచ్చాడు. ఆయన పరీక్ష చేస్తుంటే సుభద్ర అట్లాగే మాట్లాడకుండా నుంచుంది. ముందే రామారావు సంగతులన్నీ చెప్పాడు. పరీక్ష అయ్యాక డాక్టరు అడిగాడు.

'నీ పేరేమిటమ్మా?'

సుభద్ర మాట్లాడలేదు.

రామారావు చెప్పాడు.

'కాదు, రామాయమ్మారావు, రాణీరామాయమ్మారావు' అని చెప్పింది సుభద్ర.

'పిల్లలెందరండీ మీకు' అన్నాడు డాక్టరుగారు.

"ఇద్దరండీ. పెద్దవాడు వీధిలో ఆడుతున్నాడే మీరు వచ్చేటప్పటికి. చూడలేదూ?' రఘూ అని బిగ్గరగా కేకేసింది.

మళ్ళీ డాక్టరు ప్రశ్న అడిగేలోపల 'పిల్లవాడు లేచాడేమోనండీ' అంటూ లోపలకు పరుగెత్తింది.

మర్నాడు డాక్టరు మళ్లీ వచ్చాడు.

"రాత్రి రెండున్నరకు పురుడొచ్చిందండీ. పిల్ల ఒకటే ఏడుపు. మా వారికి ఇంటిసంగతే పట్టడంలేదు. కాస్త చూడండి" అన్నది గుక్క తిప్పుకోకుండా సుభద్ర ముద్దుగా పిల్ల వంకకు చూసినట్లు చూస్తూ.

'డాక్టరుగారూ ఎంత ఖర్చైనా సరే' అని ఇంక మాట్లాడలేక కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రామారావు.

డాక్టరుగారన్నారు : "మీ ఆవిడకు పిచ్చే ఎక్కింది, కాని మీరావిడకు ఇవ్వలేని సుఖం ఈపిచ్చి ఇస్తోంది. జమీందారుగారిభార్యననీ ఐదారుగురు పిల్లలు తనకున్నారనీ అనుకుంటుంది. ఆనందిస్తోంది. జోలపాటలతోను వాళ్లనుగురించి భర్తతో మాట్లాడడంతోనూ తీరిక లేకుండా కాలం గడుపుతోంది. మీరావిడ సుఖం కోరితే మరే డాక్టరుకి చూపించవద్దు. ఆవిడ పిచ్చితగ్గాలని కోరద్దు. మన లోకంలోకి ఆవిడని తీసుకురావడం అంటే నరకంలోకి తీసుకురావడమన్నమాట. ఇట్లా ఆవిడనికాపాడుతూపోషిస్తేఆవిడకు భర్తగా మీ విధి మీరు నెరవేరుస్తారు. వాస్తవిక జీవితంలో విఫలమైన మనోరధాలు పిచ్చిలో సఫలమైనయ్యి !"

రామారావుదగ్గర అట్లాగేనని వాగ్దానం తీసుకుని డాక్టరుగారు వెళ్లిపోయారు.